నాణ్యమైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం పెద్దిశెట్టిపల్లి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. దేశంలోని ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగు వైద్యం అందించడంతోపాటు గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేకక శ్రద్ధ చూపిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, సర్పంచ్ మునిరత్నం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి (బుజ్జిరెడ్డి), మహిళా, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్ పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో శనివారం గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల్లో ఉండే ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారన్నారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 214 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, హరిప్రసాద్, పూర్ణలత, ఎంపీడీఓ నాగరాజు, జెడ్పీటీసీ సుచిత్ర, ఎంపీటీసీ సభ్యుడు లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

బంగారుపాళెం: ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని జంబువారిపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర జబ్బులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 270 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జంబువారిపల్లె, ముంగరమడుగు సర్పంచులు అమర, కుమారి, జెడ్పీటీసీ సోమశేఖర్, మండల వైద్యాధికారి లోహిత్, వైద్యులు, ఆరోగ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్


కళ్లద్దాలను అందజేస్తున్న శైలజాచరణ్‌రెడ్డి

జాబ్‌కార్డు దారులందరికీ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పూతలపట్టు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులను కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం అధికారులు 'సామాజిక తనిఖీ ప్రజావేదికను' నిర్వహించారు. డ్వామా పీడీ గంగాభవాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల కల్పనలో పూతలపట్టు జిల్లా స్థాయిలో వెనుకబడిందన్నారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమష్టిగా పనిచేసి ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఆరోగ్యానికి దివ్య ఔషధంలాంటి మునగ చెట్ల పెంపకానికి ప్రభుత్వం సహకరిస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వాటితోపాటు లబ్ధిదారులు తప్పకుండా ఇంకుడు గుంతలను నిర్మించేలా అధికారులు వారికి తెలియపరచాలన్నారు. ఉద్యానవన శాఖ పరిధిలో చేపడుతున్న మామిడి మొక్కల పెంపకంలో చనిపోయిన మామిడి మొక్క స్థానంలో వేరే మొక్కను తప్పక నాటాలని రైతులకు సూచించారు. అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉపాధి కూలీలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, రాజారత్నంరెడ్డి, దొరస్వామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, డివిజనల్ విజిలెన్స్ ఆఫీసర్ సౌభాగ్యలక్ష్మి, ఎంపీడీఓ గౌరి, ఏపీఓ సంధ్యారాణి, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

3న శ్రీపురం సత్రం వేలం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని శ్రీపురం వెంకట్రాయ శెట్టి సత్రంలోని షాపులను వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు షాపులు, ఒక ఖాళీ స్థలాన్ని ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీజైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులతో కంటి పరీక్షలు నిర్వహిస్తామని, ఉదయం 7 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి అన్ని సేవలు ఉచితంగా అందించనున్నట్లు వివరించారు.

దుష్టుల వల్లే దుర్యోధనుడు పతనం

చిత్తూరు రూరల్: దుష్టుల వల్లే దుర్యోధనుడు పతనమయ్యాడని ఎస్వీయూ తెలుగు ప్రాచార్యులు గార్లపాటి దామోదరనాయుడు తెలిపారు. శనివారం చిత్తూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో చైతన్య సాహితి, హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రమహాభారతంలో దుర్యోధనుడు అంశంపై స్మారకోపన్యాసం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధర్మానికి...న్యాయానికి, సత్యానికి..నిజానికి మధ్య వ్యత్యాసాన్ని మహాభారతం తెలియజేస్తోందన్నారు. దుర్యోధనుడు నియమాలను తుంగలో తొక్కి యుద్ధం చేసేవాడన్నారు. మంచిగా బతకడానికి ఈర్ష్య, పగ, ప్రతీకారం పనికిరావని సూచించారు. అనంతరం పలువురు వక్తలను చైతన్య సాహితీ అధ్యక్షుడు నాగిరెడ్డి, కార్యదర్శి గుమ్మడి జయరామిరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆముదాల మురళి, రాధాకృష్ణారెడ్డి, భాస్కర రెడ్డి, మునస్వామి, రాజరత్నంరెడ్డి, మొగిలయ్యశెట్టి, ఆముదాల పద్మనాభం పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం


బోరు ప్రారంభించి నీళ్లు తాగుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కొత్తగా డ్రిల్ చేసిన తాగునీటి బోరును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ప్రారంభించా రు. శనివారం 11వ డివిజన్‌లోని లక్ష్మమాంబపురంలో బోరును ప్రారంభించి, స్థానికులకు నీళ్ల ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5.26 లక్షలు వెచ్చించి ఎల్‌బి.పురం వాసుల కోసం కొత్త నీటి బోరును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిప్యూటీ ఇంజినీరు వెంకటప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

బంగారుపాళెం: రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా సిబ్బంది చూడాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని శెట్టేరి గ్రామంలో శనివారం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో వివిధ రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం ఈ పంట నమోదుపై రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాలను పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు. వ్యవసాయం సాగులో రైతులు పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. సేంద్రియ సాగుపై అన్నదాతలు ఆసక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన మందులు, ఎరువులు పంటలకు విరివిగా వినియోగించడం వల్ల కలిగే నష్టాలను గురించి తెలియజేశారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రరెడ్డి, సహాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, వీఏఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ సాధ్యం


వసంతాపురంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ రజనీకాంత్

గుడిపాల: పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ సాధ్యమవుతుందని వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. వసంతాపురం గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతుభరోసా భవనాల సమీపంలో శనివారం ఆయన మొక్కలను నాటించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యాలయాల చుట్టూ బాదం, ఉసిరి, కానుగ, జామ, కొబ్బరి మొక్కలను తన సొంత నిధులతో నాటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, వార్డు మెంబర్ సురేంద్రారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని మునిసిపల్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో కమిషనర్ సమీక్షించారు. కమిషనర్ డా.అరుణ హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని, నవంబర్‌లో పూర్తి చేయాల్సిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆ మేరకు రోజువారీ పనులు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వార్డు కార్యదర్శులు, వలంటీర్లు, నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా పనులు ప్రారంభించి నిలిపివేసిన లబ్ధిదారులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. వార్డు సచివాలయం స్థాయిలో ఉదయం నీటి సరఫరా తీరు, సాయంత్రం వీధిలైట్ల నిర్వహణ కచ్చితంగా పరిశీలించి రోజువారి వివరాలు సమర్పించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, పౌర సేవలు, పన్నుల వసూలు, నిర్దేశించిన రోజువారీ విధి నిర్వహణపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ డిప్యూటీ ఇంజినీరు గురు రాజన్, ఏఈ శ్రీధర్, మెప్మా సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు, ఎంహెచ్వో డా.లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అందుకోవాలి


విద్యార్థులకు బహుమతులందిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోరార్జీ

యాదమరి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని మండలంలోని దళవాయిపల్లె మాజీ ఎంపీటీసీ మోరార్జీ కోరారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఎఫ్ఏ 2 పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రమణ్యం పిళ్లై, ఉపాధ్యాయులు దయ, రాధిక, పద్మజ, దినకర తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వాల్మీకి జయంతి

యాదమరి: మండల కేంద్రంలో వాల్మీ కి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బోయ సంఘం నాయకులు గ్రామంలో వెలసిన శ్రీరామాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం సీతారామ, లక్ష్మణ చిత్రపటాన్ని చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. బోయసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న మహిళ శనివారం ఆత్మహత్యకు యత్నించింది. తనను ఇద్దరు ఉద్యోగులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయింది. గమనించిన ఇద్దరు స్టాఫ్ నర్సులు పెట్రోల్ క్యాన్, అగ్గిపెట్టెను లాగేసుకున్నారు. అనంతరం ఆమె ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమార్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆయన సమస్యను అపోలో యజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు వేధించిన సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం


మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్: తమ భూమిని కొందరు వ్యక్తులు కలిసి అక్రమంగా పట్టాదారు పాసు పుస్తకం చేసుకున్నారని పెనుమూరు మండలం కలిగిరి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, వసంత ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ, కలిగిరి ప్రాంతంలో తన తండ్రి పేరుతో 3.61 సెంట్ల భూమి ఉందన్నారు. అయితే తమకు తెలియకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా పాసుపుస్తకాలు చేసుకున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే తమ కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పుకొచ్చారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ క్రాప్ బుకింగ్ జాబితా విడుదల


నమోదు చేసిన పంట వివరాలను రైతులకు తెలియజేస్తున్న సిబ్బంది

గుడిపాల: ఖరీఫ్ సీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్ చేసి ఈకేవైసీ పూర్తిచేసిన లబ్ధిదారుల వివరాలను సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. గుడిపాల, పాపసముద్రం, పా నాటూరు రైతుభరోసా కేంద్రాల్లో శనివారం రై తులతో గ్రామసభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు ఆధారంగానే రైతులకు, కౌలు రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంట నష్టపరిహారం, పంటరుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు ఈక్రాప్ నమోదు ఉంటేనే అందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తులసీరాంరెడ్డి, యోగప్రియ పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓలు

గుడిపాల: మండలంలోని వసంతాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి శనివారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలించారు. లెసన్ ప్లాన్‌తో పాటు డైరీల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యాకానుకకు సంబంధించి విద్యార్థులకు అందాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం ఏం వడ్డిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడు లోకనాథం, సీఆర్‌పీ వాణి తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలి


బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న ఆటో నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆటో యూనియన్ నాయకులు మాలిక్ తెలిపారు. స్థానిక కొంగారెడ్డిపల్లెలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డ్రైవర్లకు లైసెన్సులు ప్రభుత్వ రుసుముతో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోలు పెరగడంతో గిరాకీలు తగ్గాయని చెప్పారు. వాహనాలు తరచూ మరమ్మతు అవుతున్నట్లు పేర్కొన్నారు. విడిభాగాల ధరలు పెరిగాయని, వాటి ధరల్లో 30 శాతం తగ్గించాలన్నారు. సమావేశంలో నాయకులు రఫీ, గోపి, కుమార్, రియాజ్, షాజహాన్, కుట్టి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: మండలంలో 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఎస్‌విసెట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ బీఎల్వోలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్వోలందరూ అర్హులైన వారందరినీ తప్పక ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. డిసెంబర్ 9వ తేదీలోపు ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరణించినవారు, వివాహమైన యువతుల ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని 260 పోలింగ్ బూత్‌లలోని బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లు, డీఎల్డీఓలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

అర్ధగిరి ఆలయం మూసివేత


ఆలయాన్ని మూతవేస్తున్న ఆలయ అర్చకులు

తవణంపల్లె: చంద్రగ్రహణం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి శనివారం సాయంత్రం ఆలయ అర్చకులు మూతవేశారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం, ప్రాకారోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ అధికారులు రద్దు చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని మూతవేసి తర్వాత ఆలయ శుద్ధి చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల వితరణ



క్రీడా పరికరాలు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఐరాల: మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన జాయిన్ ద డాట్ సంస్థ ద్వారా రూ.50 వేల విలువ చేసే క్రీడా పరికరాలను శనివారం అందజేసినట్లు హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. సిద్ధంపల్లె పాఠశాల క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన అండర్-19 ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపికలో కాణిపాకం ప్లస్-2 కు చెందిన బాలికలు సుప్రియ, కావ్య, సారిక, అర్బునిషా ఎంపికయ్యారని తెలిపారు. వీరు త్వరలో నంద్యాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్‌లు రాఘవ, కార్తీక్‌ను అభినందించారు. క్రీడా పరికరాలను అందజేసిన జాయిన్ ద డాట్ సంస్థ వారికి హెచ్ఎం, పీడీలు నాగరాజు, మహరాణి, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు.